


నేడు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం



జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్ పేర్కొన్నారు. జెడ్‌పి సమావేశ మందిరంలో ఉదయం పది గంటలకు స్థాయీ సంఘాల సమావేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు. పది గంటలకు 2వ స్థాయి, 11 గంటలకు 4వ స్థాయి, మధ్యాహ్నం 12 గంటలకు 7వ స్థాయి సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు 1వ స్థాయి, మూడు గంటలకు 6వ స్థాయి, సాయంత్రం నాలుగు గంటలకు 3వ స్థాయి, ఐదు గంటలకు ఐదో స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఈత పైనా వాత

క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం, రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ చేతులెత్తేసింది. గతంలో తాము నిర్వహించిన క్రీడా సంస్థలను ప్రయివేటు యాజమాన్యాలకు కట్టబెట్టేసింది. సకాలంలో ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో, నిర్వహణ బాధ్యతలను శాప్ ప్రయివేటు వ్యక్తులకు అప్పగించింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని స్విమ్మింగ్ పూల్‌ను కట్టబెట్టింది. శిక్షణా రుసుములు ఒక్కసారిగా రెట్టింపు కావడంతో ఈత నేర్చుకునే వారిపై వాత పడింది.

- శిక్షణా రుసుము రూ.500 నుంచి రూ.800కు పెంపు
- పెద్దల నుంచి రూ.800 నుంచి రూ.1200 వసూలు
- స్విమ్మింగ్ పూల్‌ను ప్రయివేట్‌కు అప్పగించిన ఫలితం
- పేద విద్యార్థులకు భారంగా రుసుములు



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈత పోటీలకు శిక్షణ ఇచ్చేందుకు శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌లో కాలనీలో స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించారు. రాష్ట్రస్థాయి మొదలుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఈత పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు రాణిస్తున్నారు. ఇప్పటివరకు ఈతకొలను నిర్వహణ బాధ్యతలను శాప్ నిర్వహిస్తోంది. జిల్లా కేంద్రంలో ఉన్న ఈత కొలనులో వేసవి సీజన్‌లో 200 మంది చిన్నారులు, సుమారు 50 మంది పెద్దలు ఈత నేర్చుకుంటున్నారు. ఉదయం 6 నుంచి 9 గంటలు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు ఈత నేర్పిస్తారు. మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు గంటల వరకు మహిళలకు, 8 నుంచి 9 గంటల మధ్య వీఐపీలకు ఈత నేర్పుకుంటారు. గతంలో ఈత నేర్చుకునే చిన్నారుల నుంచి శాప్ ఆధ్వర్యాన నెలకు రూ.500 వసూలు చేసేవారు. పెద్దల నుంచి రూ.800 వసూలు చేసేవారు. వచ్చిన మొత్తంతో అలమ్, ఇతర శుద్ధి ద్రావణాలు కొనుగోలు చేస్తారు. శాప్ నుంచి ప్రతి మూడు నెలలకోసారి రూ.30 వేల నుంచి రూ.40 వేలు నిర్వహణ వ్యయంతో పాటు కోచ్‌లు, ఇతర సిబ్బంది జీతభత్యాలు విడుదల చేసేవారు. ఏడాది కాలంగా సుమారు రూ.2.75 లక్షల ద్రావణాల కొనుగోలు బిల్లులు విడుదల కాలేదు. గతంలో ఈత కోసం వసూలు చేస్తున్న ఫీజులను నేరుగా కలెక్టర్ అనుమతితో జిల్లా క్రీడా సాధికార సంస్థ వినియోగించుకునే వీలుండేది. నాలుగేళ్లుగా వసూలు చేస్తున్న ఫీజులు సైతం జిల్లా క్రీడా సాధికార సంస్థకు కాదని, నేరుగా రాష్ట్ర ఖాతాకు జమ చేయాల్సి వస్తోంది. ఆపై ఖర్చులు, జీతభత్యాలను రాష్ట్రస్థాయి నుంచి విడుదల చేస్తే తప్ప వినియోగించుకునే అవకాశం ఉండడం లేదు.



రుసుముల వివరాలు

భారీగా పెరిగిన రుసుములు

ప్రభుత్వం నుంచి బకాయిలు రాకపోవడంతో ఈత కొలనులన్నింటినీ మూడేళ్ల నిర్వహణ ప్రాతిపదికన ప్రయివేటు వ్యక్తులకు అప్పగించేందుకు శాప్ యాజమాన్యం నిర్ణయించింది. శ్రీకాకుళంలో ఉన్న ఈత కొలను నిర్వహణ బాధ్యతలను జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ దక్కించుకుంది. నెలకు రూ.65 వేలు చొప్పున శాప్‌కు అద్దె చెల్లించడంతో పాటు కోచ్‌ల జీతభత్యాలు, ఇతర నిర్వహణ ఖర్చులను వారే చూసుకోవాలి. దీంతో ఇప్పుడు ఈత కోసం వెళ్లే వారిపై పెద్దఎత్తున భారం మోపుతూ ఫీజుల ధరలను పెంచారు. శిక్షణా రుసుమును రూ.500 నుంచి రూ.800కు పెంచారు. సభ్యత్వ రుసుమును రూ.800 నుంచి రూ.వెయ్యికు పెంచారు. గతంలో పెద్దలకు వసూలు చేస్తున్న రూ.800 ఫీజును రూ.వెయ్యి చేశారు. సభ్యత్వ రుసుమను రూ.వెయ్యి నుంచి రూ.1500కు పెంచారు. దీంతో ఈత నేర్చుకునేందుకు వచ్చే వారిపై అదనపు భారం పడుతోంది.

శాప్ ఆదేశాలకు అనుగుణంగా నిర్వహణ



ఈత కొలను నిర్వహణ బాధ్యతలను జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్‌కు అప్పగించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహణ ఉంటుంది. ఏటా వేసవి, శీతాకాలాల్లో ఈత నేర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. వర్షాకాలంలో కొద్దిమంది మినహా ఎక్కువ మంది సాధన చేయడం సాధ్యం కాదు. ఆ సమయంలోనూ నిర్వహణా భారం ఒకే మాదిరిగా ఉంటుంది.

- కె.శ్రీధర్, చీఫ్ కోచ్

పేద విద్యార్థులకు భారం



ఈత కోసం ప్రతిరోజూ ప్రాక్టీసు తప్పనిసరి. ఫీజులు పెంచడం ద్వారా సౌకర్యాలు మరింత మెరుగవుతాయని చెప్తున్నా, విద్యార్థులకు ఆర్థికభారం పడుతోంది. గతంలో మెడల్స్ సాధించాలన్న ఉత్సాహంతో సాధన చేసేందుకు వెసులుబాటు కల్పించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఉండడం లేదు.

- నవీన్ , విద్యార్థి


ధర్నా చేస్తున్న కార్మిక, రైతు, ప్రజాసంఘాల నాయకులు


'పోక్సో' కింద అరెస్టు చేయాలి

- మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి
- కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్, హర్యానా మంత్రి సందీప్ సింగ్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేసి, తక్షణమే వారిని బర్తరఫ్ చేయాలని కార్మిక, రైతు, ప్రజాసంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెజ్లర్ల పోరాటానికి సంఘీభావంగా నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద కార్మిక, రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి మాట్లాడుతూ న్యాయం కోసం, గౌరవం కోసం పోరాడుతున్న మహిళా రెజ్లర్లకు ప్రతిఒక్కరూ సంఘీభావాన్ని తెలియజేయాలన్నారు. దేశానికి అవార్డులు తెచ్చి పెట్టిన, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన భారత స్టార్ మహిళా రెజ్లర్లపై జరిగిన లైంగిక వేధింపులపై ఫిర్యాదును నమోదు చేయకుండా తిరస్కరించడం మోడీ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకు ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా మల్లయోధులు ముందుగా జనవరిలో దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలిపారని, దర్యాప్తు చేసి న్యాయం చేస్తామన్న హామీపై నిరసనను ముగిస్తే, నేటికీ ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు. కమిటీ నివేదికను పంచుకోవడానికి ఐఒఎ నిరాకరించిందన్నారు. బ్రిజ్ భూషణ్ పార్లమెంటులో అధికార బిజెపికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీ కావడం వల్ల బిజెపి ప్రభుత్వం నిందితులకు రక్షణ ఇస్తోందని విమర్శించారు. సందీప్ సింగ్ కూడా హర్యానా బిజెపి ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్నారని గుర్తు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్, సందీప్ సింగ్ రెజ్లర్లను బెదిరిస్తున్నారని, తమ ప్రాణాలకు ముప్పు ఉందన్న భయంతో రెజ్లర్లు ఉన్నారన్నారు.

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ నిరసన తెలుపుతున్న మల్లయోధులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్ట సమయంలో విచారణ పూర్తి చేయాలని కోరారు. నిరసనకారులు, జర్నలిస్టులపై క్రూరమైన దాడికి పాల్పడిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన తెలిపే హక్కును గౌరవించాలని, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదేశంలో విద్యుత్‌ను తక్షణమే పునరుద్ధరించి, తాగునీరు సౌకర్యం కల్పించాలన్నారు. రిటైర్డ్ సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నేతృత్వాన మెజిస్టీరియల్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు సీనియర్ నాయకులు భవిరి కృష్ణమూర్తి, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిశోర్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాద్, జి.సింహాచలం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రాజు, ఉపాధ్యక్షులు డి.చందు, కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలాకి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.


నౌపడ : పెద్దకేసినాయుడుపేటలో రహదారిపై కూలిన చెట్టు

గాలి వాన బీభత్సం

- ఈదురుగాలులకు నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- 12 గంటల పాటు అంధకారం
- మామిడి రైతు కుదేలు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి, నౌపడ, కోటబొమ్మాళి, పోలాకి


కోటబొమ్మాళి : ఊడికలపాడులో నేలరాలిన మామిడికాయలు

సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, పలాస, పోలాకి మండలాల్లో బుధవారం అర్ధరాత్రి గాలి వాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో బలంగా వీచిన ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. సంతబొమ్మాళి, పోలాకి మండలాల్లో 40 పైబడి విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. కొన్నిచోట్ల విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు తెగిపడడంతో సుమారు 12 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంతబొమ్మాళి మండలంలోని యామలపేట, నౌపడ, సీతానగరం, మర్రిపాడు గ్రామాల్లో విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. యామాలపేట, నౌపడలో వర్షానికి కాలువలు పొంగి ఇళ్లల్లోకి వరద నీరు చేరి అర్ధరాత్రి ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. విద్యుత్‌శాఖ ఇఇ వి.ఎ రాజశేఖర్, డిఇ ఎస్.శ్రీనివాసరావు, ఎఇ ఎం.శివకుమార్ సిబ్బందితో యుద్ధప్రాతిపదికన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించారు. దీంతో పలుచోట్ల గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కరెంట్ లేకపోవడంతో ఉక్కపోతకు వృద్ధులు, రోగులు, పిల్లలు ఇబ్బందులు పడ్డారు. సంతబొమ్మాళి పంచాయతీ అంట్లువరం వద్ద నిర్మిస్తున్న రైల్వే అండర్ పాసేజ్ గోడ వర్షానికి కొంత భాగం కూలిపోయింది. చిన్నపాటి వర్షానికే గోడ కూలిపోవడంతో నాణ్యతా లోపంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పలాసలో పిడుగుపాటుకు గృహోపకరణాలు దగ్ధమయ్యాయి.


నౌపడ : యామాలపేటలో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

మామిడి రైతు కుదేలు

గాలివాన భీభత్సంతో మామిడి రైతులు కుదేలయ్యారు. ఈదురుగాలులకు మామిడి పళ్లు నేలరాలాయి. కోటబొమ్మాళి మండలంలో సుమారు 550 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. ఊడికలపాడు, కోటబొమ్మాళి, కన్నేవలస, పాకివలస, దంత, కురుడు, లఖందిడ్డి, నిమ్మాడ, మూలపేట, తిలారు, బంజీరుపేట, హరిశ్చంద్రపురం, జీయన్నపేట, యలమంచిలి, కిష్టుపురం, బలరాంపురంతో పాటు పలు గ్రామాల్లో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. గాలివాన వల్ల రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని మామిడి తోటల రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. అకాల వర్షాలకు అపరాలు, కూరగాయల పంటలు, మొక్కజొన్న తీవ్రంగా దెబ్బతిన్నాయి. జీడి, మినుమ, పెసర, మిరప, చిక్కుడు, బీర, బెండ, అరటి తదితర పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా మామిడి రైతులు లక్షలు అప్పులు చేసి మామిడి తోటలను కొనుగోలు చేశామని, వరుణుడు దెబ్బకు తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


సంతబొమ్మాళి : కూలిన రైల్వే అండర్ పాసేజ్ గోడ

ఇవిఎం గోదాములను సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జెసి నవీన్

ఓటర్ల జాబితాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా అన్నారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఇవిఎం గోదాములకు మరమ్మతులు చేయించాల్సి ఉంటే, వెంటనే బాగు చేయించి సిద్ధం చేయాలన్నారు. ఇవిఎంల సరఫరాను జూన్ నుంచి ప్రారంభించి సెప్టెంబర్ నాటికి పూర్తిస్థాయిలో అందజేయనున్నట్లు తెలిపారు. ఇవిఎంలపై సిబ్బందికి శిక్షణ చేపట్టాలని సూచించారు. ఎపిక్ కార్డుల పంపిణీ, ఇఆర్‌ఒ నెట్-2పై ప్రచారం నిర్వహించాలన్నారు. జిల్లాలో ఓటర్ల నమోదుకు సంబంధించి కొత్తగా నమోదు చేయాల్సిన ఓటర్ల వివరాలతో పాటు తొలగించాల్సిన ఓటర్ల వివరాలనూ మరోమారు పరిశీలించి జాబితాను సరిచేయాలని చెప్పారు. జిల్లాల వారికి అప్పగించిన లక్ష్యాలను సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎపిక్ ద్వారా సరఫరా ప్రక్రియ జరగాలని, స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి ఈనెల 25లోగా ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. పూర్తి చేసిన వివరాలను జెసి లాగిన్‌లో ఉంచాలని స్పష్టం చేశారు.

విహారయాత్రకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజా రవాణా అధికారులు

వేసవి వినోదంతో పాటు క్షేత్రా స్థలాలను సందర్శించడానికి వీలుగా ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడుపుతోందని ప్రజా రవాణా అధికారి టి.విజయ్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను నగరంలోని ఆర్‌టిసి కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ-అరకు-బొర్రాగుహలు విహారయాత్ర స్పెషల్ పేరుతో ఈనెల 27న ఉదయం తొమ్మిది గంటలకు బయలుదేరుతున్న బస్సు భీమునిపట్నం బీచ్, కైలాసగిరి, తిరుపతి ఆలయం దర్శించుకుని అరకులో రాత్రి బస చేయనున్నట్లు తెలిపారు. అరకులో లాడ్జింగ్, డిన్నర్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మరుసటి రోజు ఉదయం ఎనిమిది గంటలకు బయలుదేరి పద్మావతి గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం, కాఫీ హౌస్, బొర్రాగుహలు సందర్శించి సాయంత్రం ఆరు గంటలకు శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు చేరుకుంటుందని వివరించారు. ఇందుకు ఒక వ్యక్తికి రూ.2,500 టిక్కెట్‌గా నిర్ణయించినట్లు తెలిపారు.

గోపాలపురం బీచ్ - చిలక సరస్సు విహారయాత్ర

శ్రీకాకుళం కాంప్లెక్స్ ఉదయం ఆరు గంటలకు బయలుదేరి గోపాలపురం బీచ్, చిలక సరస్సులోని మహా కాళీ ఆలయాన్ని సందర్శించనున్నట్లు తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరి శ్రీకాకుళం కాంప్లెక్స్‌కు బస్సు చేరుకుంటుందని చెప్పారు. ఈ యాత్రకు సంబంధించి ఒక వ్యక్తి రూ.1500 ఛార్జిగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్లు కె.ఆర్.ఎస్ శర్మ, కె.మాధవ్, అసిస్టెంట్ మేనేజర్ రమేష్, బి.దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.


రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌కు తాత్కాలిక హాల్ట్

రైల్వేశాఖకు ఎంపీ రామ్మోహన్ నాయుడు లేఖ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పాతపట్నంలో ఏడేళ్లకోసారి నిర్వహించే నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాల నేపథ్యంలో ఆంధ్రా, ఒడిశా మధ్య నడుస్తున్న రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌కు పాతపట్నం రైల్వేస్టేషన్‌లో తాత్కాలిక హాల్ట్ ఇవ్వాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ, వాల్తేరు డివిజనల్ మేనేజర్ అనూప్ కుమార్ శతపతికి లేఖ రాశారు. ఈనెల 21వ తేదీ నుంచి నిర్వహిస్తున్న నీలమణి దుర్గ ఉత్సవాలకు ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి పెద్దఎత్తున యాత్రికులు రాకపోకలు సాగిస్తారని తెలిపారు. ఈ ఉత్సవాల్లో లక్షల మంది భాగస్వాములవుతారని, దూర ప్రాంతాల నుంచి వచ్చే లక్షలాది యాత్రికులకు సరైన రవాణా సౌకర్యాల్లేకపోవడంతో ఇక్కట్లు పాలయ్యే అవకాశముందని పేర్కొన్నారు. అందువల్ల గుణుపూర్-రూర్కెలా వెళ్లే రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైలుకు పాతపట్నంలో ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు తాత్కాలిక హాల్ట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

నర్సింగ్‌లో ఉచిత శిక్షణ



శ్రీకాకుళం : డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగులకు శ్రీకాకుళం నగరంలో నర్సింగ్ (జనరల్ డ్యూటీ అసిస్టెంట్)లో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.సురేష్ తెలిపారు. కోర్సు పూర్తి చేసిన వారికి గురువారం సర్టిఫికేట్లను ప్రదానం చేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 210 మంది నిరుద్యోగ యువతకు నైపుణ్యం కలిగిన శిక్షకులతో అత్యాధునిక సదుపాయాలతో కూడిన స్కిల్లింగ్ ల్యాబ్, డిజిటల్ తరగతులతో శిక్షణ ఇచ్చామన్నారు. దీంతో పలు కార్పొరేట్, ప్రయివేటు ఆస్పత్రుల్లో ఉపాధి అవకాశాలు పొందగలిగారని చెప్పారు. జిడిఎ కోర్సులో చేరాలనుకునే 19 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు కలిగిన వారు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు 6302858816 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది నాగమణి, అనిల్ కుమార్, గిరిధర్, సంతోష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందిపై విచారణకు ఆదేశం

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీలో ఉపాధి హామీ నిధులను ఫీల్డ్ అసిస్టెంట్లు పక్కదారి పట్టించిన వ్యవహారంపై సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి విచారణకు ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు హాజరు కాని వారికి, విదేశాల్లో ఉన్న వారికి ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరు వేసి నిధులు స్వాహా చేసినట్లు ఇటీవల వెలుగులోకి వచ్చింది. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ డ్వామా ఎపిడి మురళీకృష్ణ, ఎంపిడిఒ ఉమాసుందరి, ఎపిఒ వాసునాయుడు, ఉపాధి హామీ సిబ్బందితో తన కార్యాలయంలో సమావేశమయ్యారు. నౌపడ పంచాయతీలోని ప్రతి జాబ్‌కార్డును క్షుణ్ణంగా పరిశీలించాలని, పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఎపిడి మురళీకృష్ణను ఆదేశించారు. పనులకు హాజరు కాకుండా లబ్ధి పొందిన ఉద్యోగులు, విదేశాల్లో ఉన్న వారు, మైనర్ల వివరాలను సేకరించి వారంలో రోజుల్లోగా నివేదిక అందజేయాలని ఆదేశించారు.

రేపు పిజిటి కౌన్సెలింగ్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాపరిషత్ యాజమాన్యం పరిధిలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో పిజిటిలుగా పనిచేసేందుకు పిజి అర్హత గల ఎస్‌జిటిల నుంచి గతంలో దరఖాస్తులు కోరిన మేరకు సీనియారిటీ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.తిరుమల చైతన్య తెలిపారు. ఈనెల 20వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు డిఇఒ కార్యాలయంలో సర్టిపికేట్ల వెరిఫికేషన్, కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. వెరిఫికేషన్‌లో సర్వీసు రిజిస్టరు వెంట తీసుకురావాలని పేర్కొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఆనందరావు

ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉపాధి హామీ రక్షణ కోసం ఈ నెల 25న కలెక్టరేట్ వద్ద ధర్నాను నిర్వహిస్తున్నామని, కూలీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం మండల నాయకులు బి.ఆనందరావు పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దిపాలెంలో ఉపాధి కార్మికులతో గురువారం మాట్లాడారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం కనీసం రూ.లక్ష కోట్లు బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉండగా, రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు. 200 రోజులు పని కల్పించి కనీస కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. 40 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, అందుకు ఒక్క పూట మాత్రమే పనులు చేయించాలని అన్నారు. రెండు పూటలా పని చేయిస్తే వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుందని అన్నారు. అలాగే పనిప్రదేశాల్లో టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎన్.మోహనరావు, చెల్లాయి కుమారస్వామి పాల్గొన్నారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు తాడివలస విద్యార్థి


పవన్‌కుమార్

పొందూరు: జూన్ 6 నుంచి 12 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరుగనున్న జాతీయ స్థాయి జూడో పోటీలకు మండలంలోని తాడివలస ఉన్నత పాఠశాల విద్యార్థి కెంబూరి పవన్ కుమార్ ఎంపికైనట్లు గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బళివాన హేమసుందరాచార్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు పైడి సునీత తెలిపారు. ఈ నెల 18,19 తేదీల్లో అనంతపురంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన జరిగిన అండర్-19 జూడో పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయిలో జరిగే జూడో పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ ఎంపికపై విద్యార్థికి శ్రీకాకుళం జూడో శిక్షకులు మణికుమార్, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ తమ్మినేని ప్రసాదరావు, సర్పంచ్ తమ్మినేని మణెమ్మ, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

బాడీ బిల్డర్ల సత్తా

శ్రీకాకుళం అర్బన్ : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఈ నెల 15న జరిగిన మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో శ్రీకాకుళం నుంచి ప్రాతినిధ్యం వహించిన బిల్డర్లు సత్తా చాటి పతకాలు సాధించారు. విజేతలను బాడీ బిల్డర్లను గోపాల్ ఫిట్‌నెస్ సెంటర్ ఆధ్వర్యాన గురువారం అభినందించారు. ఈ పోటీల్లో 55 కెజిలలో ప్రథమ స్థానం అరుగుల జ్యోతి కుమార్, 55 కెజిలలో అబ్దుల్ ఖాన్ మూడో స్థానం, 65 కెజిలలో ఒప్పంగి చెందిన బల్ల నవీన్‌కుమార్ ప్రథమ స్థానం, రణస్థలానికి చెందిన షేక్ మదీనా నాలుగో స్థానం, 75 కెజిలలో సందీప్‌కుమార్ మూడోస్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఆంధ్రా బిల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీ వి.విజయకుమార్, ఫిట్‌నెస్ సెంటర్ అధినేత గోపాల్, సంఘం జిల్లా అధ్యక్షులు బి.ప్రసాద్, టీమ్ మేనేజర్ కె.గౌరీశంకర్ పాల్గొన్నారు.


విజేతలను అభినందిస్తున్న గోపాల్

విద్యుత్ కోతలతో ఉక్కిరిబిక్కిరి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాత్రి, పగలు అని తేడా లేకుండా అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇటు పట్టణంలో, అటు మండలంలో రెండు రోజులుగా గంటల కొద్దీ విద్యుత్ సరఫరా నిలిపివేస్తూ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండు వేసవిలో అధిక ఉష్ణోగ్రతలకు తాళలేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. వేళాపాళా లేని అనధికార విద్యుత్ కోతలతో అల్లాడిపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల బాధలు వర్ణనాతీతం. గతంలో ఎన్నడూ లేని ఈ అనధికార విద్యుత్ కోతలు ఏమిటని విద్యుత్ సిబ్బందిని ప్రశ్నిస్తే సమాధానం రావడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లేక ఇంట్లో ఉండలేక ఉక్కపోత అలా అని బయటకు పోవాలంటే వడగాల్పుల భయం వెంటాడుతున్నదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తొగరాం, బొడ్డేపల్లిపేట, చొట్టవానిపేట, ఇండస్ట్రియల్‌లో ఉన్న సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం 11 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దూసిలో మూడు రోజులుగా వేళాపాళాలేని విద్యుత్ కోతలతో ఇన్వెంటర్లు ఛార్జింగ్ కావడం లేదు. విద్యుత్ కోతలను ప్రభుత్వం ప్రకటించకుండా సాంకేతిక సమస్యలని చెబుతున్నారు... ఇది నిజం కాదని దూసి గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై విద్యుత్‌శాఖ ఎడి కె.రాంబాబును వివరణ కోరగా, విద్యుత్ కోతలకు కారణం సాంకేతిక కారణాలేనని అన్నారు. బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు లైన్లు పాడయ్యాయని, వాటిని సరి చేస్తున్నామని అన్నారు. శుక్రవారం నాటికి యథాస్థితికి తీసుకొస్తామని తెలిపారు.

లోవోల్టేజీ సమస్యతో అవస్థలు

టెక్కలి : టెక్కలి పట్టణంలోని అయ్యప్పనగర్ ప్రాంతంలో నివాసముంటున్న కుటుంబాల వారికి లోవోల్టేజ్ సమస్య తీవ్రతరంగా ఉందని వాపోతున్నారు. వేసవి కాలం ఆరంభం నుంచి సమస్య తీవ్రతరంగా ఉంటున్నారు. రైల్వే ట్రాక్ ఆనుకుని నూతనంగా ఈ కాలనీ నిర్మించారు. సుమారు 150 కుటుంబాలు ఈ ప్రాంతంలో జీవిస్తున్నారు. పాతపట్నం సబ్ స్టేషన్ పరిధి నుంచి ఈ ప్రాంతానికి విద్యుత్ సరఫరా అవుతుంది. అక్కడ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏదైనా సాంకేతిక లోపం ఏర్పడితే ఈ ప్రాంతానికి గొంటల కొద్దీ విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

శిథిలావస్థలో వసతిగృహం


తోటవాడ బాలుర వసతిగృహం

ప్రజాశక్తి - బూర్జ

మనం చూస్తున్న ఈ చిత్రం బూర్జ మండలంలోని తోటవాడ బాలుర వసతి గృహంలోది. ఈ భవనాన్ని నిర్మించి సుమారు 5 దశాబ్దాలవుతుంది. గతంలో పైపైన మరమ్మతులు చేపట్టారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల నాడు-నేడు పథకంలో భాగంగా మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టారు. గతేడాది ఇక్కడ 38 మంది విద్యార్థుల వరకు ఉన్నారు. వసతిగృహంలో వంట గది కాకుండా విద్యార్థులు ఉండే గదులు, శ్లాబులు పెచ్చులూడుతుండటంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కిటికీలు, తలుపులు పూర్తిస్థాయిలో పాడవుతున్నాయి. వసతిగృహం ప్రధాన ద్వారం అమర్చిన ఇనుప గేటు పాడైంది. భవనం గోడలు బీటలు వారాయి. దీనిపై ఇన్‌చార్జి వార్డెన్ ఉమామహేశ్వరరావును వివరణ కోరగా... వసతి గృహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నానని అన్నారు. భవనం శిథిలావస్థకు చేరుకున్న విషయం సంబంధిత అధికారులకు తెలియజేశాను. విద్యార్థులకు సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు వివరించారు.


పెచ్చులూడుతున్న శ్లాబ్ పైకప్పు


యంత్రాలను పంపిణీ చేస్తున్న గిరిబాబు

రైతులకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, పొందర రైతులకు రాయితీపై యంత్రాలను పంపిణీ చేస్తున్నందని, వీటిని సన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలాస పెద్దవీధి, అన్న పూర్ణ ఆశ్రమం, బత్తుల వీధిలో పొందర సన్నకారు రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యాన రాయితీపై వ్యవసాయ యంత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఏడుగురు రైతులకు 40 శాతం సబ్సిడీపై యంత్రాలను పంపిణీ చేశామని చెప్పారు. కూరగాయల పంటల్లో కలుపు మొక్కలు తీసుకుంటే ఈ యాత్రాలు ఉపయోగతాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎఒ పొలారావు, ఎఇఒ పాపారావు, వార్డు ఇన్‌ఛార్జి లోకనాథం బెహరా, డబ్బీర్ నాగు, సనపల సింహాచలం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కంచిలి : మండలంలోని అన్ని గ్రామాలకూ శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎఇ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోంపేట నుంచి కంచిలి సబ్‌స్టేషన్‌కు వచ్చే హెచ్‌టి లైన్ల నిర్వహణ, ఎం.ఎస్.పల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని డివిజనల్ డిఇఒ గార పగడాలమ్మ సూచించారు. వజ్రపుకొత్తూరు ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించి జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించారు. మాట్లాడుతూ గతేడాది వజ్రపుకొత్తూరు హైస్కూల్‌లో ప్రథమ ఇంటర్ తరగతులు మంజూరైన విషయం తెలుసుకున్నారు. ప్రథమ సంవత్సరం ఇంటర్ ఫలితాలపై ఆరా తీశారు. మొదటి బ్యాచ్‌కు కొన్ని ఇబ్బందులు వల్ల ఫలితాలపై ప్రభావం ఉంటుందన్నారు. ఈ ఏడాది పూర్తిస్థాయి అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్ ఇప్పటికే జారీ చేశామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి బోధన సిబ్బంది కొరత లేకుండా చూస్తామని అన్నారు. మండలంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న జగనన్న కిట్లు సక్రమంగా ఉన్నట్లు ప్యాక్ చేసి సిద్ధం చేయాలని సూచించారు. కిట్లలో ఏమైనా లోటుపాట్లు ఉంటే సరిచేసి పాఠశాలలు ప్రారంభ సమయానికి అంతా సిద్ధంగా ఉంచాలని కోరారు. ఆమెతో పాటు ఎంఇఒ డి.తులసీరావు, హెచ్‌ఎం తారకేశ్వర పండా, సిఆర్‌పిలు, సిబ్బంది ఉన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పగడాలమ్మ

సైన్స్‌పై అవగాహన అవసరం


మాట్లాడుతున్న కామేశ్వరరావు

టెక్కలి : విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహతో పాటు చైతన్యం తీసుకువచ్చే దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉందని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన స్థానిక ఆదిఆంధ్రావీధిలో వేసవి వినోదం శిబిరం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాస్త్రీయ ఆలోచనలతో నేర్చుకున్న అంశాలు నిత్యజీవితంలో ఉపయోగపడతాయన్నారు. జెవివి రాష్ట్ర అకాడమిక్ కన్వీనర్ మల్లారెడ్డి పద్మనాభరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జెవివి ద్వారా వేసవి శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో నూతన ఆలోచనలకు శ్రీకారం చుట్టనున్నామని అన్నారు. జీవితంలో ఎదుర్కొనే ఏ ఒక్క అంశాన్నీ గుడ్డిగా నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కురమాన దాలయ్య, జెవివి బాధ్యులు పాలవలస ధర్మారావు, నందిగాం మండల శాఖ బాధ్యులు డొంకాన పాపారావు, జెవివి సాంస్కృతిక విభాగం సభ్యులు సాము సంజీవరావు, తమ్మినేని వైకుంఠరావు, టెక్కలిశాఖ కార్యదర్శి ఉర్జాన దుర్గాప్రసాద్, అంగన్వాడీ కార్యకర్త అనిత పాల్గొన్నారు.

వ్యక్తి మృతి


కామేష్ మృతదేహం

మెళియాపుట్టి : మండలంలో గొప్పిలి సమీపంలో బురగన గెడ్డలో పలాస మండలం లొద్దభద్రకు చెందిన అల్లు కామేష్ (52) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లొద్దభద్రకు చెందిన కామేష్ ఒడిశా రాష్ట్రంలో ఉన్న బంధువులకు పెళ్లికి చెప్పడానికి 16న వెళ్లాడు. మద్యం తాగి గొప్పిలి గెడ్డ వద్ద మద్యం మత్తులో పడిపో గెడ్డలోకి జారుకున్నాడు. ఎండ తీవ్రతకు గురై గెడ్డలో మృతి చెందారు. గురువారం అటుగా వెళ్లిన వారు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. సిఐ వినోద్‌బాబు, తహశీల్దార్ పి.సరోజని, వైద్యులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గ్రామస్తులతో సమక్షంలో శవపంచనామా, పోస్టుమార్టం నిర్వహించారు. ఎఎస్‌ఐ ఏఎస్‌ఐ నర్సింగరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బకు 'ఉపాధి' కూలీ మృతి


శాంతమ్మ మృతదేహం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కలివరం పంచాయతీ పీరుసా హెబ్‌పేటకు చెందిన గురుగుబెల్లి శాంతమ్మ (75) వడదెబ్బకు గురై మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం ఉదయం కంచరాపువానిపేట చెరువులో ఉపాధి హామీ పనికి వెళ్లింది. పని పది గంటలకు ముగియడంతో ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ఎండవేడికి తట్టుకోలేక పొలం గట్టుపైన కూర్చొని అక్కడికక్కడే ప్రాణాలు వదిలినట్లు తోటి కూలీలు చెబుతున్నారు. తామంతా ముందే వచ్చేశామని, వెనుక నుంచి ఒంటరిగా ఇంటికి వచ్చే క్రమంలో ఈ ఘటన జరిగి ఉంటుందని వారు చెబుతున్నారు. సాయంత్రం రెండో పూట పనులకు వస్తుండగా... ఆమె మృతి చెందినట్లు గుర్తించామని అంటున్నారు. ఉదయం పూట ఇంటికి వెళ్లి ఉంటుందని అనుకున్నామని, ఆమె ఒంటరిగా ఉండడంతో పూర్తి సమాచారం తెలియలేదని అన్నారు. ఈ విషయమై ఎపిఒ సురవరపు లక్ష్మీనర్సమ్మను వివరణ కోరగా... ఉపాధి పనిప్రదేశంలో జరగలేదని, ఇంటికి వెళ్తున్న సమయంలో మృతి చెందిందని తెలిపారు. సాయంత్రం పూట పనికి రాలేదని అన్నారు. ఈమె భర్త గతంలో మృతి చెందగా, కుమారుడు వేరే ప్రదేశంలో ప్రొక్లెయినర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుమార్తెకు వివాహమైంది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

అచ్చెన్నను కలిసిన నాయకులు

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఉన్నారని సామాజిక మాధ్యమాలు ద్వారా తెలుసుకున్న నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమతమ గ్రామాల్లో టిడిపి బలోపేతానికి కృషి చేయాలని అచ్చెన్న సూచించారు. కలిసిన వారిలో నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టెక్కలి మండల నాయకులు ఎల్.ఎల్.నాయుడు, పట్నాన భాస్కరరావు, దుద్దు దానయ్య, పల్లి సింహాచలం, కూన జనార్ధనరావు ఉన్నారు.


కార్యకర్తలతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

రాధాకృష్ణ మృతి పార్టీకి తీరని లోటు

మండలంలోని తులసిపేటకు చెందిన టిడిపి నాయకులు, విశ్రాంతి ఉపాధ్యాయులు అన్నెపు రాధాకృష్ణ బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అచ్చెన్నాయుడు స్వగ్రామానికి వెళ్లి రాధాకష్ణ పార్థవదేహానికి పూలమాలలవేసి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల ఓదార్చారు. ఈయనతో పాటు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, గొండు లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

శివాజీని విమర్శించే అర్హత లేదు


మాట్లాడుతున్న బాబూరావు

పలాస : గౌతు కుటుంబం 60 ఏళ్ల చరిత్ర గురించి మీరు, మీ మంత్రి ఎన్నిసార్లు గొంతు చించుకొని మాట్లాడినా ఈ ప్రాంతం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా లిఖించబడిన చరిత్ర వారిదని, దీనిని చెరిపెడం ఎవరి తరమూ కాదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. వజ్రపుకొత్తూరుకు చెందిన ఎంపిపి. ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ జగన్ మందు తాగి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని, ఉదయ్‌కుమార్‌కు రాజకీయ భిక్ష పెట్టింది శివాజీ అని గుర్తు పెట్టుకోవాలని అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మేము కల్పిస్తే... మీరు అనుభవిస్తున్నారని అన్నారు. ఉద్దానం వాటర్ స్కీం, ఎన్‌టిఆర్ సుజల స్రవంతి, నువ్వలరేవు వంతెన, వంకులూరు నడక వంతెన, పుడిలంక రహదారి, వజ్రపుకొత్తూరు ఎంపిడిఒ కార్యాలయం, తుపాను షెల్టర్లు, తారు రోడ్లు, ఆఫ్‌షోర్‌కు నిధులు, డయాలసిస్ కేంద్రాలు, ఆస్పత్రుల అభివృద్ధి కార్యక్రమాలు మీ కంటికి కన్పించలేదా? అని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు పాల్గొన్నారు.

టిడిపివి ఉత్తరకుమార ప్రగల్భాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన మినీ మహానాడులో వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో 160 సీట్లు టిడిపి వస్తాయని ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారని, కనీసం 160 నియోజకవర్గాల్లో పోటీ చేసే దమ్ము ఉందా? అని జిల్లా టిడిపి నాయకులను వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ప్రశ్నించారు. పట్టణంలోని జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. గెలుపు సంగతి పక్కన పెడితే అభ్యర్థులను పోటీ చేయిస్తామని చెప్పే దమ్ము, ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. జనసేన పార్టీతో ఒప్పందం కుదుర్చుకుంటే ఎవరి స్థానాలు వదులు కోవాలో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. జగనన్న సంక్షేమ ఫలాలే రాబోయే ఎన్నికల్లో వైసిపికి శ్రీరామరక్ష అని అన్నారు. సమావేశంలో కొప్పల ఈశ్వరరావు, ముద్దాడ ఈశ్వరరావు, దానేటి రామమోహన రావు, చింతాడ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతాడ రవి

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- పలాస

రాజకీయాలకు అతీతంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో వార్డు ఇన్‌ఛార్జి రాజాశ్రీకాంత్ అధ్యక్షతన గురువారం గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సాంకేతిక కారణాలతో ఏదైనా సంక్షేమ పథకాలు రాని వారిని గుర్తించి తక్షణమే అధికారుల సమక్షంలో పరిష్కరించారు. వార్డు అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం, సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావుచిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, బోనెల రాము, డబ్బీరు భవాని, బమ్మిడి సంతోష్, పులిరాజు, రవి, పిసిఎంఎ అధ్యక్ష, కార్యదర్శులు మల్లా సురేష్, కె.వి.శివ పాల్గొన్నారు.


పలాస : మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు



ఇచ్ఛాపురం : పథకాలను వివరిస్తున్న విజయ

ఇంటింటికీ సంక్షేమం

ఇచ్ఛాపురం : ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించేందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని ధర్మపురంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అవగాహన కల్పించారు. ముందుగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వాలకు, ప్రస్తుత ప్రభుత్వ పాలనపై వివరించారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంఎపి బొర పుష్ప, కంచిలి ఎంపిపి పైలా దేవదాస్‌రెడ్డి, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, కారింగి మోహనరావు, రంపత్ని చిట్టిబాబు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

జలుమూరు: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని రాణ సచివాలయ పరిధి హుస్సేన్‌పురం పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ ద్వారా అందజేస్తున్న లబ్ధిని ఆయా కుటుంబాలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, వైసిపి నాయకులు కనుసు సీతారాం, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మన్మథరావు పాల్గొన్నారు.


జలుమూరు : పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

దరఖాస్తులకు ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా వ్యాప్తంగా ఖాళాగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్వాడీ కార్యకర్తల ఖాళీలను భర్తీ చేయడానికి గురువారం నోటిఫికేషన్ విడుదల చేశామని పీడీ జి.జయదేవి తెలిపారు. గతంలో రోస్టర్ ప్రకారం అభ్యర్థులు దొరకని కేంద్రాల్లో అర్హులైన ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు ఈసారి అవకాశం కల్పిస్తూ నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. 123 కేంద్రాల్లో ఖాళీలను పొందుపరిచామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 25 సాయంత్రం 5 గంటల లోపు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఎంపిక ప్రక్రియను త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు.

టెక్కలి : టెక్కలి ఐసిడిఎస్ కార్యాలయం పరిధిలోని టెక్కలి, సంతబొమ్మాళి మండలాల పరిధిలో పలు అంగన్వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలు, ఆయాలు పోస్టు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామని పిఒ శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి మండలంలోని వి.ఆర్.కె.పురం, తెలినీలాపురం, కొండభీంపురం, సంతబొమ్మాళి మండలంలోని ఆర్.సున్నాపల్లి, సూరాడవానిపేట, శివరాంపురం, మేఘవరం-2, మరువాడ, భావనపాడు, కూర్మనాథపురం గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లోని ఖాళీలను భర్తీ చేయనున్నామని తెలిపారు. ఈ నెల 18 నుంచి 25 లోగా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి- సోంపేట


పట్టణంలోని యశోద నగర్ కాలనీలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ పనులను ఇఒ వై.వరప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీల్లో చెత్తా చెదారాలు వేయరాదని సూచించారు. కాలువల్లో చెత్తా చెదారాలు పేరుకుపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతుందన్నారు. దీంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతూ... రోగాల బారిన పడతాయని అన్నారు. ఇక నుంచి డ్రెయినేజీలో చెత్తా చెదారాలు వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఇఒ వరప్రసాద్

తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

లావేరు : తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ఉద్యోగులు మద్యం తాగి చిందిలేయడం, కుర్చీల్లో నిద్రించడంపై గురువారం 'ప్రజాశక్తి'లో కథనం ప్రచురితమైంది. ఈ ఘటనపై వచ్చిన కథనంపై ఇన్‌ఛార్జి తహశీల్దార్ డి.నారాయణమూర్తి సంజాయిషీ కోరుతూ ముగ్గురు ఉద్యోగులకూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇందులో సీనియర్ సహాయకులు పి.గోవిందరావు, జూనియర్ సహాయకులు బి.రాజేష్, అటెండర్ బాబూరావులకు నోటీసులను అందజేశారు.

ఎపిటిఐడిసిఒ డైరెక్టర్‌గా గోవిందరావు


గోవిందరావు

బూర్జ : ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఖండాపు గోవిందరావును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇంతవరకు పార్టీ కోసం హర్నిశలూ కృషి చేశానని, తన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తనకు ఈ బాధ్యతలను అప్పజెప్పడం ఆనందంగా ఉందని అన్నారు. ఎపిటిఐడిసిఒ రాష్ట్ర నియామకానికి కృషి చేసిన శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, తమ్మినేని చిరంజీవి నాగ్ కృతజ్ఞతలు తెలిపారు.


బ్యాగును పరిశీలిస్తున్న ఎక్సైజ్ సిఐ కృష్ణారావు

ఐదు కేజీల గంజాయి పట్టివేత

పలాస: పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తుల బైక్ నుంచి జారిపడి ఐదు కేజీల గంజాయి బ్యాగ్ పోలీసులకు పట్టుబడింది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై రెండు బ్యాగ్‌లతో వేగంగా ఎక్కడి నుంచో పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ వైపు వచ్చారు. వెంటనే అక్కడ నుంచి తిరిగి వెళ్లిపోతుండగా చిన్న బ్యాగ్ వాహనంపై నుంచి జారిపోయింది. వెంటనే ప్రయాణికులు ఆ బ్యాగ్‌ను ఆర్‌టిసి ఉద్యోగులకు అప్పగించారు. తీరా బ్యాగ్ తెరిచి చూస్తే సరికి గంజాయి అని తేలింది. దీంతో ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్‌టిసి సిఐ సంతోష్ కుమార్ కాశీబుగ్గ, ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ సిఐ కృష్ణారావు, పోలీసులు దొరికిన గంజాయిని అదుపులో తీసుకున్నారు. గంజాయి విలువ రూ.25 వేలు విలువ ఉంటుందని చెప్పారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు గృహోపకరణాలు దగ్ధం

పలాస : కాశీబుగ్గ-నర్సిపురానికి చెందిన ఎస్.కె.మబ్బుల్ ఇంటి మూడో అంతస్తులో బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి పిడుగు పడింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని గృహోపకరణలు కాలిబూడిదయ్యాయి. నివాస గృహంలో మంటలు వ్యాపించడంతో రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న జిఆర్‌పి కానిస్టేబుల్ భాస్కరరావు చూసి ఫోన్‌లో సమాచారం అందజేశారు. అప్పటికే మూడో అంతస్తులో ఉన్న ఎసి, విలువైన ఇంటి గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు మంటలను అదుపు చేశారు.


దగ్ధమైన ఎసి

పవన్ కళ్యాణ్‌పై విమర్శలు తగవు

ఆమదాలవలస : సుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలని లక్ష సంతకాల సేకరణ కోసం ఎవరెవరి దగ్గర ఎంత ప్యాకేజీ తీసుకున్నావని వైసిపి ప్రచార విభాగం జోనల్ కమిటీ చైర్మన్ చింతాడ రవికుమార్‌ను జనసేన సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు పైడి మురళీమోహన్ ప్రశ్నించారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ని ప్యాకేజీ స్టార్ అని నోటికొచ్చినట్లు పరిణతి లేని మాటలు మాట్లాడటం వైసిపి నాయకులకే చెందిందని విమర్శించారు. ఇక నుంచి పవన్‌కళ్యాణ్‌ను అంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని లక్ష సంతకాలు సేకరించి నానా హంగామా చేశారని, కానీ, ఇప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న వ్యక్తి ఎవరో నియోజకవర్గ ప్రజలకు తెలుసునని అన్నారు. నియోజకవర్గ నాయకుడిగా చెప్పుకొనే మీరు ఎలా నాయకుడు అయ్యారో తెలియడంలేదని వ్యంగ్యంగా విమర్శించారు.


ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

విద్యార్థికి అండ

కవిటి: మండలంలోని గొండ్యాలపుట్టుగకు చెందిన విద్యార్థి బొర్ర ఝాన్సీకి హైదరాబాద్‌కు చెందిన ఇందిరాదేవి, మణికుమార్ ఆధ్వర్యాన చింతామణి అమ్మవారి ట్రస్టు అండగా నిలిచింది. స్థానిక ఎస్‌విజె కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఝాన్సీ చదువులో చురుకుగా ఉంటూ అన్ని పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధిస్తోంది. కానీ, ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితులు చదువుకు అడ్డంకిగా మారాయి. దీంతో ఝాన్సీ చదువుకు అండగా ఉంటామని చెప్పి చింతామణి అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ సమక్షంలో గురువారం ఝాన్సీ తండ్రికి రూ.50 వేలు అందజేశారు. కార్యక్రమంలో పూడి లక్ష్మణరావు, పాండవ శేఖర్, బెందలం రమణ, ఆరంగి రాజు, పొల్లాయి ఉమా మహేష్, జన్ని లోకనాథం పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

సోంపేట : మండలంలోని బారువకు చెందిన చిరంజీవి, తన్మయ్ అనే తండ్రీ కొడుకులు ఇటీవల మహేంద్ర తనయా నది దాటుతూ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గురువారం సీడప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, పలాసపురం సర్పంచ్ తడక జోగరావులు బాదిత కుటుంబాన్ని గురువారం పర్మార్శించారు. అనంతరం రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి జి.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలో విశాఖ-బి కాలనీలో ఉన్న షిర్డీసాయి మందిరంలో గురువారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీతో పాటు జిల్ ఫౌండేషన్ సౌజన్యంతో ఈ అన్నదానం నిర్వహించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మజ్జిగనూ పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు డాక్టర్ ప్రియాంక, జిల్ ఫౌండేషన్ సభ్యులు సత్య సాయి, జాడ సాయి, ఉమా శంకర్, శివ పాల్గొన్నారు.


అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

ప్రజల కష్టాలు పట్టించుకోరా?


మాట్లాడుతున్న విఠల్‌రావు

ప్రజాశక్తి- పలాస

తెలుగుదేశం పార్టీ ఆదేశాలతో గ్రామాల్లో అక్టోంబరు నెలలో మొదలపెట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంతో ప్రజలు అనేక సమస్యలు విన్నవించుకున్నారని, ఈ కార్యక్రమం ద్వారా వైసిపి అసమర్థ పాలన తేటతెల్లమైందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. తాగునీరు, రోడ్స్, నిరుద్యోగ సమస్య, మహిళా భద్రత, అవనీతి, సంక్షేమ పథకాల్లో కోతలు, వివక్షపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని చెప్పారు. ప్రభుత్వంలో నియంత పాలనా కొనసాగుతుందని, ప్రజా శ్రేయస్సు కోసం అధికార పార్టీ నాయకులు పనిచేయడం లేదని విమర్శించారు. ప్రతి సమస్యనూ టిడిపి రాష్ట్ర నాయకత్వానికి నివేదిస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్ గుప్త, జోగ మల్లి, డొక్కరి శంకర్, నాగరాజు, శశిభూషణ్, సప్ప నవీన్, సూరాడ మోహనరావు, కూర్మారావు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి- కవిటి

బుధవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు మండలంలో ఉద్యాన పంటలైన మామిడి నేలరాలగా, అనేక కొబ్బరి చెట్లు నేలకూలాయని, పంట చేతికొచ్చిన సమయంలో దెబ్బ తిన్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఇచ్ఛాపురం జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ కోరారు. ఈ మేరకు డిటిలు రామచంద్రరావు, ఈశ్వరరావులకు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మరో పది, పదిహేను రోజుల్లో మామిడి పంట చేతికొస్తుందంటే, ఈదురు గాలులకు టన్నుల కొద్దీ మామిడి కాయలు నేల రాలిపోయాయని అన్నారు. దీంతో మామిడి రైతుకు అపార నష్టం వాటిల్లిందన్నారు. అదే సమయంలో పెను గాలులకు కొబ్బరి చెట్లు సైతం నేలకులాయని, ఉద్యానశాఖ అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఉద్దానం ప్రాంతంలో జీడి రైతులను దళారులు దోచుకుంటున్నారని, ప్రభుత్వం స్పందించి జీడికి మద్దతు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పండి పృథ్వీ, దాసు రౌలో, కాళీ, ప్రశాంత్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న రాజేష్

జీడి పంటకు మద్దతు ధర కల్పించాలి

పలాస: ఉద్దాన ప్రాంతంలో పండిస్తున్న జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని, జీడి పంటపై ఎన్నో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని నియోజకవర్గం జనసేన నాయకులు డాక్టర్ దుర్గారావు అన్నారు. ఈ మేరకు విజయవాడలోని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ రాహుల్ పాండేను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస నియోజకవర్గ ఉద్దానం ప్రాంతంలో 21,290 ఎకరాల్లో జీడి తోటలు విస్తరించి ఉన్నాయిని, 25 వేల మందికి పైగా జీడీ పంటపైన ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. పలాస పరిసర ప్రాంతంలోని జీడి పరిశ్రమలకు ఈ ప్రాంతం నుంచే జీడి పిక్కలు కొనుగోలు చేసి ఎగుమతి అవుతున్నాయని అన్నారు. 2018 అక్టోబరులో వచ్చిన తిత్లీ తుపానుతో జీడి, కొబ్బరి పూర్తిగా నాశనమైందన్నారు. ప్రభుత్వం, రైతు నేతల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం 80 కేజీల పిక్కల బస్తా రూ.1,080 గిట్టుబాటు ధరగా ప్రకటించిందని, ప్రభుత్వమే పిక్కలను కొనుగోలు చేసేందుకు పలాస మండలం బొడ్డపాడు, వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి, మందస మండలం రట్టి, బహాడపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందనే విషయాన్ని గుర్తు చేశారు. ఆ కొనుగోలు ఆ ఏడాదికే పరిమితమైందన్నారు. రైతులు పండించే జీడీ పంటకు కనీస మద్దతు ధర రూ.16,000 ప్రభుత్వం కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న దుర్గారావు

కొనసాగుతున్న విజ్ఞాన శిబిరం

ఎచ్చెర్ల : మండలంలోని ధర్మవరం శాఖాగ్రంథాలయంలో సహాయకులు బి.భాగ్యలక్ష్మి, గ్రామ నివాసి, పిఇటి సిహెచ్.ఈశ్వరమ్మ ప్రతి విద్యార్థీ ఆటలు ఆడాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పద్మాసనం, భుజంగాసనం, చక్రాసనాలు వేయడం వల్ల శారీరిక కండరాలు, ఎముకలు దృఢంగా ఉంటాయని అన్నారు. గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖరరావు మాట్లాడుతూ ఆటల వల్ల ప్రావీణ్యంతో పాటు పేరు, ప్రతిష్టలు వస్తాయని అన్నారు. కొండేటి ప్రకాష్ 65 మంది విద్యార్థులకు మజ్జిగను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి, గ్రంథాలయ సహాయకులు బి.సూర్యనారాయణ, గ్రంథాలయ పాఠకులు సూరిబాబు, గణేష్, మహేష్, జగదీష్, సురేష్, కిరణ్ పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆటల సందడి నెలకుంది. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు బి.జయకుమార్ పలు క్రీడలు ఆడించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్, సహాయకులు అమ్మనమ్మ, 28 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మురపాక శాఖాగ్రంథాలయంలో రిసోర్స్ పర్సన్ పి.సూర్య తేజస్విని డ్రాయింగ్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

పలాస : విద్యార్థులకు చదువుతోపాటు కథలు నేర్చుకోవడం అవసరమని కాశీబుగ్గ గ్రంథాలయాధికారి రాంబాబు అన్నారు. కాశీబుగ్గ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞన శిబిరంలో పాల్గొన్నారు.


ఎచ్చెర్ల : మాట్లాడుతున్న చంద్రశేఖర్


సమీక్షిస్తున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి

'జగనన్నకు చెబుదాం'పై సమీక్ష

ప్రజాశక్తి- సోంపేట

జగనన్నకు చెబుదాంలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మండలస్థాయి అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సోమవారమూ ఉదయం 10 నుంచి గంటసేపు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి డి.పనిభూషణరావు, తహశీల్దార్ కూర్మారావు, ఎంపిడిఒ వెంకటరమణ, ఎఒ నరసింహమూర్తి, ఎపిఒ ప్రమీల, ఎపిఎం రవణమ్మ పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

మాతృమూర్తి యువజన సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- కవిటి

మాతృమూర్తి యువజన సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షుడుగా జగదీష్ చంద్ర పట్నాయక్, సలహాదారుగా నల్లా సుజాత, అధ్యక్షుడుగా జుత్తు చలపతి, ఉపాధ్యక్షుడుగా కుర సాహు, కార్యదర్శిగా అంగ సురేష్, సహాయ కార్యదర్శిగా ఈరోతు కేశవరావు, కోశాధికారిగా మోహన్ దొళాయి, సహాయ కోశాధికారిగా కీలు రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీశాఖ అధికారులు

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

సోంపేట : ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, ఇంధన వనరులను ఆదా చేయాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అటవీశాఖ అధికారి మురళీకృష్ణనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని కొర్లంలో గురువారం స్థానిక అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యాన గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. లైఫ్‌స్టైల్ ఎన్విరాన్మెంట్ కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్.రాము, టి.వెంకటేశ్వరరావు, ఎస్.దుర్గాదేవి, ఆర్.జోగారావు పాల్గొన్నారు.

70 మందికి వైద్య పరీక్షలు

కొత్తూరు : మండలంలోని గురండి పంచాయతీలో సర్పంచ్ బోర సింహాద్రినాయుడు ఆధ్వర్యాన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 70 మంది రోగులకు వైద్యులు ఎన్.తేశ్వశ్రీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీచేశారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కృష్ణ, సింహాచలం, వెంకట్, గులోకర్, భవాని, రాజు, లక్ష్మి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.